

బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్న చిన్న మునిగల్ గ్రామస్తులు

## బీఆర్ఎస్‌కు చిన్నమునిగల్ గ్రామస్తుల మద్దతు

నేరేడుగొమ్ము(చందంపేట), నవంబర్ 2 : తమ గ్రామానికి సాగునీరు అందించేందుకు అంబా భవాని లిఫ్టు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికే తాము మద్దతు తెలుపుతున్నట్లు నేరేడుగొమ్ము మండలం చిన్నమునిగల్ గ్రామస్తులు తెలిపారు. గురువారం గ్రామంలో సర్పంచ్ పోమ్లానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. లిఫ్టు నిర్మానం పూర్తయితే ఈ ప్రాంత భూములు సాగులోకి వచ్చి తమ కష్టాలు తీరుతాయన్నారు. తమ బాధలు తీర్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భావోజీ, శంకర్‌నాయక్, దాసనాయక్, డాక్యానాయక్, బిచ్చునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేతి విద్యాసాగర్ 24 గంటల్లోగా క్షమాపణ చెప్పాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేందర్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నరేందర్

నకిరేకల్, నవంబర్ 2 : ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలను మాజీ శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్ వెనక్కి తీసుకుని 24 గంటల్లోగా ఆయనకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నేతి విద్యాసాగర్ ఇంటిని ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నకిరేకల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. దళిత ఎమ్మెల్యే చిరుమర్తిపై అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే నేతి విద్యాసాగర్ ఎక్కడికెళ్లినా ఎమ్మార్పీఎస్ నాయకులు వదిలిపెట్టరని, అణువణువునా వెంటాడుతారన్నారు. క్షమాపణ చెప్పకపోతే ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే నేతిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఎమ్మార్పీఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు నకిరేకంటి అంజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేశ్, , మేడి నర్సింహ, జాతీయ ప్రధాన కార్యదర్శి నక్క కృష్ణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింత సైదులు, మునుగోటి ఉత్తరయ్య, జిల్లా నాయకులు చింతా లక్ష్మణ్, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర నాయకులు సిరుపంగి రామలింగయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే భగత్ పరామర్శ

త్రిపురారం, నవంబర్ 2 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుంకరపల్లి భూపతిరావు గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ కార్యకర్త ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. భూపతిరావు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ధూళిపాల రామచంద్రయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే. దస్తగిరి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- అంబా భవానీ లిఫ్టుతో నేరేడుగొమ్ము సస్యశ్యామలం
- దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్
- నేరేడుగొమ్ము మండలంలో గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ప్రచారం



గిరిజన మహిళకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో కూడిన కరపత్రాన్ని అందించి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ చిత్రంలో బీఆర్ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి

నేరేడుగొమ్ము(చందంపేట), నవంబర్ 2 : అభివృద్ధిని చూసి మరోసారి తనను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ దేవరకొండ అభ్యర్థి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. గురువారం నేరేడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి, బుగ్గతండా, వైజాగ్‌కాలనీ, చిన్నమునిగల్, బచ్చాపురం, పెద్దమునిగల్, మోసంగడ్డతండా, కొత్తపల్లి, పేర్వాల, గుర్రపుతండా, పందిరిగుండుతండా, నేరేడుగొమ్ము గ్రామాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి, బిల్యానాయక్, రమేశ్‌నాయక్‌తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబా భవానీ లిఫ్టుతో నేరేడుగొమ్ము మండలం సస్యశ్యామలం అవుతుందని, చిన్నమునిగల్ గ్రామ సమీపంలో కొనసాగుతున్న లిఫ్ట్‌తో ఈ ప్రాంతంలో 3,200 ఎకరాలకు సాగునీరు అందనుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మారుమూల మండలాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజాగ్ కాలనీలో ఎకో టూరిజం మంజూరైందని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే పనులు మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. ఎకో టూరిజం ఏర్పాటుతో వైజాగ్‌కాలనీవాసులకు ఉపాధి మెరుగుపడుతుందన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తండాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అభివృద్ధిని కొనసాగించాలంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. సీఎం కేసిఆర్‌తోనే తెలంగాణ బంగారు తెలంగాణగా మారనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను అమలు చేస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తుంటే, కాంగ్రెసోళ్ల 3 గంటలే కరెంటు సరిపోతదని పేర్కొనడం వారి అవగాహన రాహిత్యానికి అద్దం పడుతుందన్నారు.

### కాంగ్రెస్ వస్తే అంధకారమే

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే అన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రైతుబంధును రూ.16 వేలకు పెంచడంతోపాటు పింఛన్ రూ.5వేలకు, సిలిండర్‌ను రూ.400లకే అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, కేసీఆర్ కిట్ దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు గుర్తుచేశారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారని, కాంగ్రెస్ ఓటమి ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతావత్ బిల్యానాయక్, వడ్త్య రమేశ్‌నాయక్, ఎంపీపీ పద్మాహన్మానాయక్, జడ్పీటీసీ బాలూనాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లోకసాని తిరుపతయ్య, పీఏసీఎస్ చైర్మన్ బాలయ్య, వైస్ ఎంపీపీ ఆరెకంటి ముత్యాలమ్మారాములు, బైరెడ్డి కొండల్‌రెడ్డి, కేతావత్ రవీందర్‌నాయక్, సర్పంచ్‌లు పల్స వెంకటయ్య, నాగునాయక్, బాలూనాయక్, బావోజీ, ఆంజనేయులు, కేతావత్ హరిలాల్, వడ్త్య చైతన్య, సోమ్లానాయక్, డాక్యానాయక్, సాయన్న, దేవుడు, బషీర్, చిన్నానాయక్, రాజు పాల్గొన్నారు.



కాచరాజ్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

### అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

మాల్ : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం చింతపల్లి గ్రామానికి చెందిన పందుల సత్యం గౌడ్, గంజి మహేందర్, మస్న సందీప్‌తోపాటు పలువురు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ ఖిలాపై గులాబీ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఇతర పార్టీల వారు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నట్వగిరిధర్, నాయకులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలు తెలుసుకోవడానికే సర్వే

చిట్యాల, నవంబర్ 2 : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను తెలుసుకోవడానికి స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఉపయోగపడుతుందని ఎంఈఓ నర్సింహ అన్నారు. ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం అచీవ్‌మెంట్ సర్వేపై ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు మాథ్స్, ఇంగ్లిషు సబ్జెక్టులలో జబ్లింగ్ విధానంలో పరీక్షల రూపం లో ఈ సర్వే జరుగుతుందని, ప్రశ్నాపత్రాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని వివరించారు. ఈ మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, కొండకింది అంజిరెడ్డి, హెచ్‌ఎం పాల్గొన్నారు.

## బీజేపీ పాదయాత్రలో జనం కరువు

హాలియా, నవంబర్ 2 : నాగార్జునసాగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంకణాల నివేదితారెడ్డి గురువారం నిడమనూరు నుంచి హాలియాకు చేపట్టిన పాదయాత్రకు జనం కరువయ్యారు. పాదయాత్రలో మొత్తం వంద మంది కూడా లేకపోవడంతో అభాసు పాలైంది. దాంతో పాటు చాలా మంది బీజేపీ నాయకులే యాత్రకు వెళ్లలేదు. నిడమనూరు–హాలియా మధ్య 8 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండడం, ఈ మధ్యలో పెద్దగా గ్రామాలు లేక పోవడంతో అసలు ఆమె పాదయాత్ర ఎందుకు నిర్వహించినట్లు అని ఆ పార్టీ నాయకులే ప్రశ్నిస్తున్నారు. పాదయాత్ర అనంతరం హాలియా చౌరాస్తాలో నివేదితారెడ్డి మాట్లాడిన తీరును చూసి ప్రజలు కాసేపు నవ్వుకున్నారు. బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు పర్చలేని, హాలియాకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం తీసుకు రాలేదంటూ పేర్కొనడం చూసీ బీజేపీ నాయకులు, కార్యకర్తలే నవ్వుకున్నారు. హాలియాకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరై రెండు సంవత్సరాలైంది. ప్రస్తుతం కళాశాలలో 400 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. దాంతో పాటు సీఎం కేసీఆర్ హాలియాకు మినీ స్టేడియం మంజూరు చేయడంతో పాటు రూ.3.75 కోట్లు కూడా విడుదల చేశారు. ఈ విషయాలు హాలియాలో ప్రతి ఒక్కరికీ తెలిసినా.. ఆమె అసలు రాలేదంటూ మాట్లాడడం చూసి అసలు ఆమె ఇన్ని రోజుల్లో స్థానికంగా ఉన్నారా లేదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



హాలియాలో జనమే లేని బీజేపీ సభ

## క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- క్షయ నివారణ జిల్లా అధికారి కల్యాణ్ చక్రవర్తి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కల్యాణ్‌చక్రవర్తి

మాడ్గులపల్లి, నవంబర్ 2: క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్యులు కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి కల్యాణ్‌చక్రవర్తి సూచించారు. గురువారం మండలంలోని పాములపాడు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై వ్యాధి నివారణపై సలహాలు అందించారు. క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. దాంతో పాటు ఆస్పత్రికి వచ్చే రోగుల విషయంలో వైద్యులు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ సంజయ్‌కుమార్, సిబ్బంది యాదగిరి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.